# క్రైమ్ మిర్రర్
THE
Voice of Anti Corruption
15 ANNIVERSARY

హైదరాబాద్
1-11-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 218

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## మంత్రిగా అజారుద్దీన్.. ప్రమాణస్వీకారం

- అల్లా పేరు మీద ప్రమాణం
- రాజ్‌భవన్‌లో అజారుద్దీన్ ప్రమాణం
- ప్రమాణస్వీకారం చేయించిన రాష్ట్ర గవర్నర్
- హాజరైన రేవంత్ రెడ్డి, మంత్రులు

2లో

## కతారీ దంపతుల కేసులో సంచలన తీర్పు

చిత్తూరు: మాజీ మేయర్ కతారీ అనురాధ దంపతుల హత్య కేసులో సంచలన తీర్పు వెలువడింది. ఐదుగురిని దోషులుగా ఇదివరకే నిర్ధారించిన చిత్తూరు



# ఎకరానికి రూ. 10 వేలు

**ఇల్లు మునిగితే రూ.15 వేలు.. పూర్తిగా కూలితే ఇందిరమ్మ ఇల్లు**

**పశువులు చనిపోతే రూ.50 వేలు.. జీవాలకు రూ.5 వేల చొప్పున..**

**మొంథా తుపాను బాధిత రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ**

**వరంగల్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే**

**12 జిల్లాల్లో మొంథా తుపాను ప్రభావం ఉందన్న సీఎం**

**వరద నష్టంపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశం**

**కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచన**

**నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిక**

**శాఖల మధ్య సమన్వయం లేకనే సమస్యలు**

**హనుమకొండ కలెక్టరేట్ సమీక్షలో ముఖ్యమంత్రి**



రాష్ట్రంలో మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 12 జిల్లాల్లో తుపాను ప్రభావం ఉందని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేల పరిహారం ఇస్తామని ప్రకటించారు.

వరంగల్: రాష్ట్రంలో మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 12 జిల్లాల్లో తుపాను ప్రభావం ఉందని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేల పరిహారం ఇస్తామని ప్రకటించారు. వరదల్లో ఇల్లు మునిగిన వారికి రూ. 15 వేలు, పూర్తిగా కూలిపోతే ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు.

2లో

## కాంగ్రెస్ పార్టీకి ఓటడిగే హక్కు లేదు

**ఎర్రగడ్డ డివిజన్‌లోని కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**ఎన్నికల హామీల అమలుపై సీఎం నోరు మెదపట్లేదన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**జూబ్లీహిల్స్‌లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయంటూ మండిపాటు**



# మొంథా నష్టం రూ.5,244 కోట్లు

- 1.38 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక నివేదిక
- తక్షణ సాయం చేయాల్సిందిగా వినతి
- ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు బృందాలను పంపండి
- కేంద్ర హోంశాఖ కార్యదర్శికి నివేదన

అమరావతి: మొంథా తుపాను నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. 17 శాఖలు, రంగాలలో రూ.5,244 కోట్లు నష్టం వాటిల్లిందని పేర్కొంది. పూర్తిస్థాయిలో వివరాలు వస్తే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శికి ఈ నివేదిక పంపారు.

2లో

## జమ్మూకశ్మీర్ పాపం కాంగ్రెస్‌దే

- మొత్తం కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలని సర్దార్ పటేల్ సంకల్పించారు
- అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అందుకు అనుమతించలేదు
- కాంగ్రెస్ తప్పులకు మనం మూల్యం చెల్లించాల్సి వస్తోంది
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్

ఏక్తానగర్: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు.

2లో

## మరో పదేళ్లు రక్షణ బంధం

**కొత్త రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న భారత్- అమెరికా**

**కౌలాలంపూర్‌లో రాజ్‌నాథ్, పీట్ హెగ్సెత్ సంతకాలు**



2లో

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో సహకారాన్ని పొడిగించుకునేందుకు భారత్- అమెరికా



2లో

## ఇల్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యమా?

- నందినగర్‌లో జరిగిన రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్
- రేవంత్ సర్కారు హైడ్రా బుల్డోజర్‌తో వేల ఇళ్లు కూల్చింది
- పేదల శాపాలే కాంగ్రెస్‌కు ఉరితాళ్లయి చుట్టుకుంటాయ్
- 4 లక్షల జూబ్లీహిల్స్ ఓటర్ల తీర్పుతో 4 కోట్ల ప్రజల గోస తీరుతుంది
- పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు పోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది?


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

**సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం**



- తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
- క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
- తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
- న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
- స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
- సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
- సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
- ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**9393929595**

# కాంగ్రెస్ పార్టీకి ఓటడిగే హక్కు లేదు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా శు క్రవారం హైదరాబాద్ ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాదయాత్రగా అందరినీ పలకరిస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయట్లేదని మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేక దయనీయ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఎక్కడ చూసినా గుంతల రహదారులు, పొంగుతున్న మురుగు కాల్వలు, వెలగని వీధి దీపాలే దర్శనమిస్తున్నాయని చెప్పారు. నియోజకవర్గానికి చుట్టూ ఉన్న కూకట్‌పల్లి, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి ప్రాంతాలు గతంతో పోలిస్తే బాగా అభివృద్ధి చెందినప్పటికీ జూబ్లీహిల్స్ మాత్రం అలాగే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలు.. ఈసారి బీజేపీ అభ్యర్థి ని గెలిపించాలని కోరారు. ఇతర పార్టీల్లా రాజకీయాలు



చేయాలనుకోవట్లేదని.. తమ నిజాయతీనే తమను గెలిపిస్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల గూండాయిజం, రౌడీయిజాన్ని అంగీకరించ బోమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ప్రభావం లేదని.. కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి ప్రజల్లో కనిపించట్లేదని అన్నారు. మజ్లిస్ ఓట్లపై నమ్మకంతోనే కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే మజ్లిస్ నుంచి అభ్యర్థి ని తెచ్చుకున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి స్థానికంగా అందుబాటులో ఉంటాడని.. ఆయనకు ఒక్క ఫోన్ కాల్ చేయగానే ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుండి నడుస్తాడని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## మంత్రిగా అజారుద్దీన్..

# పమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. అల్లా పేరు మీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర కేబినెట్ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా మధ్యాహ్నం 12:25 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం 9 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం. మరోవైపు, అజారుద్దీన్ కు ఏ శాఖ కేటాయిస్తారనే విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఇల్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యమా?

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్/గోల్కొండ: పేదల ఇళ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కేసీఆర్ లక్ష ఇళ్లు కడితే రేవంత్‌రెడ్డి సర్కారు హైడ్రా బుల్డోజర్‌తో వేల ఇళ్లు కూల్చిందని ఆరోపించారు. ఆ పేదల శాపాలే కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఉరితాళ్లై చుట్టుకుంటాయని దుయ్యబట్టారు. ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని పలుచోట్ల ఆయన రోడ్ షోలు నిర్వహించారు. తొలుత షేక్‌పేటలో ప్రచార వాహనం నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కేసీఆర్ ప్రభుత్వం జీవో 58, 59 కింద 1.5 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చిందని గుర్తుచేశారు. ఒక్క జూబ్లీహిల్స్‌లోనే 3,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇంటి పట్టా ఇవ్వలేదు సరికదా పేదల ఇళ్లు కూలగొడుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విసిగిపోయిన 4 కోట్ల మంది ప్రజల గోస తీర్చే అవకాశం 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లకు వచ్చిందని కేటీఆర్ చెప్పారు. ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోయి చిత్తుచిత్తుగా ఓడితేనే ప్రజలకు రావాల్సిన బాకీలన్నీ వస్తాయన్నారు. మైనారిటీలను ఆకట్టుకోవడానికే కాంగ్రెస్ పార్టీ అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. రెండేళ్లుగా మైనారిటీలకు ప్రాతినిధ్యం లేని కేబినెట్‌ను కొనసాగించిన రేవంత్‌రెడ్డి.. ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ కులమతాల పునాదులపై పనిచేయదని.. కానీ కాంగ్రెస్ ఆ పని చేస్తోందని మండిపడ్డారు. ఆడబిడ్డలు, వృద్ధులు, ఆటోడ్రైవర్లు సహా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ 420 హామీలిచ్చినా ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. దోచుకున్న సొమ్ముతో ప్రజలకు రూ. 5 వేల చొప్పున ఇచ్చి ఓట్లు కొనేందుకు వస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ నేతలిచ్చే డబ్బు తీసుకొని ఆడపడుచులైతే మిగతా రూ. 55 వేలు ఏవని అడగాలని.. మిగతా వారు వారికిచ్చిన హామీలకు అనుగుణంగా మిగతా అప్పు ఎప్పుడు తీరుస్తారని ప్రశ్నించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో సంపద సృష్టిలో నంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ ప్రస్తుతం రేవంత్ సర్కారు పాలనలో అట్టడుగున 28వ ర్యాంక్‌కు పడిపోయిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్‌ను నాశనం చేసిందని.. ఆటోవాళ్ల ఉపాధి దెబ్బతీయడం వల్ల 162 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. నగర ప్రజల్ని, గ్రామీణ రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ రెండేళ్ల పాలనను, పదేళ్ల కేసీఆర్ పాలనను చూసిన ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కేటీఆర్ కోరారు.

# మరో పదేళ్లు రక్షణ బంధం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 'యూఎస్- ఇండియా మేజర్ డిఫెన్స్ పార్టనర్‌షిప్'పై కౌలాలంపూర్‌లో ఇరు దేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, పీట్ హెగ్సెత్ శుక్రవారం సంతకాలు చేశారు. అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియా నేషన్స్ (ఏషియాన్) సమావేశాల్లో భాగంగా రాజ్‌నాథ్, హెగ్సెత్ రక్షణ ఒప్పందంపై చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య 2015లో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందం ఈ ఏడాదితో ముగుస్తుండటంతో దాని స్థానంలో మరో పదేళ్ల కాలానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం భారత్‌ను అమెరికా తన ప్రధాన రక్షణ భాగస్వామిగా గుర్తిస్తుంది. దీంతో ఆ దేశం నుంచి కీలకమైన రక్షణ సాంకేతికతోపాటు ఆయుధాల దిగుమతులకు మార్గం సుగమం అవుతుంది. రెండు దేశాల సైన్యాల మధ్య సమాచార మార్పిడి, కీలక నిఘా సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయి. తాజా ఒప్పందంతో భారత్%-% అమెరికా మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతుందని రాజ్‌నాథ్‌సింగ్ సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. 'భారత్%-%అమెరికా రక్షణ సంబంధాలకు ఈ డిఫెన్స్ ఫ్రేమ్‌వర్క్ విధానపరంగా విస్తృతమైన మార్గదర్శనం చేస్తుంది. రెండు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సహకారానికి ఈ ఒప్పందం ఉదాహరణ. హెగ్సెత్‌తో చర్చలు ఫలవంతం అయ్యాయి. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ సహకారం ప్రధానమైనది'అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రాంతీయ స్థిరత్వానికి మూలస్తంభం లాంటిదని హెగ్సెత్ తెలిపారు. సమాచార మార్పిడి, సాంకేతిక సహకారం విషయంలో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందం భారత్%-%అమెరికా రక్షణ సంబంధాల్లో కొత్త అధ్యాయమని భారత ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్), అమెరికాకు చెందిన జీఈ ఏరోస్పేస్

# జమ్మూకశ్మీర్ పాపం కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

ఏక్తానగర్: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్ సమస్యకు ఆ పార్టీ తప్పిదాలే కారణమని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన తప్పులకు కశ్మీర్‌తోపాటు దేశం మూల్యం చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర సంస్థానాల తరహాలోనే మొత్తం జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో పూర్తిగా విలీనం చేయాలని ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ సంకల్పించగా, అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అందుకు అనుమతించలేదని విమర్శించారు. శుక్రవారం గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. పటేల్ ఐక్యతా విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్‌లో సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ అంశంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైందని అన్నారు. ఆ పార్టీ నిర్వాకం వల్ల జమ్మూకశ్మీర్ ముక్కలైపోయిందని, అక్కడ ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక జెండా వచ్చాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ పొరపాట్ల కారణంగా మన దేశం దశాబ్దాలుగా బాధలు అనుభవిస్తోందని ఆక్షేపించారు. ప్రధాని మోదీ



ఇంకా ఏం మాట్లాడారంటే... "కొత్త చరిత్ర లిఖించడంలో ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దని సర్దార్ పటేల్ బోధించారు. కానీ, మనం కొత్త చరిత్ర సృష్టించడానికి కష్టపడి పనిచేయాలి. అసాధ్యం అనుకున్న పనిని పటేల్ సుసాధ్యం చేశారు. 550కుపైగా సంస్థానాలను దేశంలో విలీనం చేశారు. ఆయన పాటించిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలు కొత్త చరిత్రను సృష్టించాయి. 'ఒకే ఒక్క ఐక్య భారత్, అద్భుతమైన భారత్' ఆయన స్వప్నం. దేశ సార్వభౌమత్వ పరిరక్షణకు పటేల్ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన మరణం తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు దేశ సార్వభౌమత్వాన్ని నిర్లక్ష్యం చేశాయి. పటేల్‌తరహాలో శ్రద్ధ చూపించలేదు. ఫలితంగా కశ్మీర్ అంశం పెద్ద సమస్యగా మారింది. ఈశాన్య భారతదేశంలోనూ కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. నక్సలైట్%-%మావోయిస్టు ఉగ్రవాదం దేశమంతటా వ్యాప్తి చెందింది. దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. పటేల్ విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు తుంగలో తొక్కాయి. వెన్నెముక లేనట్లుగా వ్యవహరించాయి. కాంగ్రెస్ బలహీన విధానాల వల్ల కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుంది. అక్కడ పాక్ ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం మొదలైంది. దానివల్ల మన దేశం ఇప్పటికీ నష్టపోతూనే ఉంది. నక్సలైట్ల హింసాకాండపై గత 11 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ఈ సమస్య పూర్తిగా మటుమాయం అయ్యేదాకా పోరాటం కొనసాగుతుంది. 2014 కంటే ముందు 125 జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండేది. ఇప్పుడు 11 జిల్లాల్లోనే వారి ఉనికి పరిమితమైంది.

# ఎకరానికి రూ. 10 వేలు

(మొదటి పేజీ తరువాయి)

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం శు క్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్లు, అధికారులతో కలిసి నగరంలోని వరద ప్రభావిత కాలనీలు సమ్మయ్యనగర్, పోతననగర్, రంగంపేటలో పర్యటించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావిత 12 జిల్లాల కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. తుపాను ప్రభావంపై వెంటనే పూర్తిస్థాయి నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. 'రాష్ట్రంలో 12 జిల్లాల్లో మోంథా తుపాను ప్రభావం ఉంది. ఏడు జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు అక్కడి కలెక్టర్లతో సత్వరం సమీక్షలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలి. వరదలు తగ్గుముఖం పట్టినందున వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. చెత్తను తొలగించి, శానిటేషన్ చేయాలి. కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు పంపాలి. వరదల వల్ల మరణించినవారి జాబితాలను పారదర్శకంగా ఇచ్చేలా పోలీసు శాఖ వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి నివేదికలు అందించాలి. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల నష్టపరిహారం ఇస్తాం. వరదల వల్ల మేకలు, గొర్రెలు మృతి చెందితే రూ. 5 వేలు, పెద్ద పశువులు మృత్యువాత పడితే రూ. 50 వేలు ఇచ్చేలా పశుసంవర్ధక శాఖ నివేదికలు పంపాలి. పత్తి, వరి చేతికి వచ్చే ముందు నష్టం జరిగితే ఎకరానికి రూ. 10 వేలు ఇస్తాం. నీట మునిగిన పంటతోపాటు ఇసుక మేటలు వేసిన ప్రాంతాల బాధిత రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అవసరాన్ని బట్టి రూ. లక్ష వరకు సాయం చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు అంచనాలు తయారు చేయాలి. ఇల్లు మునిగినవారికి రూ. 15 వేలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వరదలకు ఇళ్లు కూలి నిరాశ్రయులైన వారికి ప్రత్యేక కోటా కింద ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు జాబితా సిద్ధం చేయాలి. అర్హులకు ప్రభుత్వ స్థలంలో ఇంటి పట్టాలు ఇచ్చే అంశంపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలి.

# మోంథా నష్టం రూ.5,244 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

తక్షణ ఆర్థిక సాయం చేయాలని కోరారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉందని, 1.38 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోని 2.96 లక్షల టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయని, 1.74 లక్షల మంది రైతులు రూ. 829 కోట్ల వరకు నష్టపోయినట్లు వివరించారు. 249 మండలాల్లోని 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై ప్రభావం ఉందని, 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందాలను పంపాలని కోరారు. 12,215 హెక్టార్లలో రూ. 40 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతినగా 23,979 మంది రైతులకు నష్టం వాటిల్లిందని, ఆక్వారంగంలో 32 వేల ఎకరాల్లోని రూ. 514 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారని తెలిపారు. 2,261 పశువులు మృతిచెందాయన్నారు. 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, 429 కి.మీ. మేర తీగలు తెగిపడ్డాయి. ఈ శాఖకు రూ. 19 కోట్ల నష్టం జరిగింది. నీటి పారుదల శాఖకు రూ. 234 కోట్ల మేర నష్టం కలిగింది. 23 జిల్లాలలోని 3,045 ఇళ్లు ధ్వంసమయ్యాయి. అంగన్వాడీలు, పాఠశాలలు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, చేనేత మగ్గాలు అన్నీ కలిపి రూ. 122 కోట్ల నష్టం వాటిల్లింది. రోడ్లు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నష్టం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తుపానుతో ముగ్గురు చనిపోయారని వెల్లడించారు. 4,794 కి.మీ. మేర ఆర్అండ్‌బీ రోడ్లు, 311 కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని, రూ. 2,774 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. 18 జిల్లాల్లోని 862 కి.మీ. మేర పంచాయతీరాజ్ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు పాడవడంతో రూ. 454 కోట్ల నష్టం జరిగిందని, 48 పట్టణాల్లోని రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు ధ్వంసమయ్యాయని, వీటి పునరుద్ధరణకు రూ. 109 కోట్లు కావాలని నివేదికలో వివరించారు.

# కఠారీ దంపతుల కేసులో సంచలన తీర్పు

జిల్లా కోర్టు శుక్రవారం మరణ శిక్ష ఖరారు చేసింది. ప్రభుత్వ కార్యాలయంలోనే జరిగిన ఈ హత్యోదంతాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తీర్పు సందర్భంగా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. 2015 నవంబరు 17న చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోకి బురఖాలు ధరించి తుపాకులు, కత్తులతో ప్రవేశించిన దుండగులు.. మేయర్ కఠారి అనురాధపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. ఆపై పక్క గదిలో ఉన్న కఠారి మోహన్‌ను కత్తులతో నరికారు. తీవ్ర గాయాలతో మోహన్ వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మరణించారు. పదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది ఈ ఘటన. ఈ కేసులో.. తొలుత 23 మందిని నిందితులుగా పేర్కొన్నారు. కాసరం రమేష్(ఏ22) తనకు కేసుతో సంబంధం లేదని పిటిషన్ దాఖలు చేయగా అతడి పేరును తప్పిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్.శ్రీనివాసాచారి(ఏ21) కేసు విచారణ సాగుతుండగానే మృతిచెందారు. దాంతో 21 మంది నిందితులుగా ఉన్నారు. అయితే ఇందులో శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ(ఏ1), గోవింద స్వామి శ్రీనివాసయ్య వెంకటాచలపతి అలియాస్ వెంకటేష్(ఏ2), జయప్రకాష్‌రెడ్డి అలియాస్ జయారెడ్డి(ఏ3), మంజునాథ్ అలియాస్ మంజు(ఏ4), మునిరత్నం వెంకటేష్(ఏ5)లు దోషులుగా తేలారు. దీంతో ఈ ఐదుగురికి ఇవాళ మరణశిక్ష విధించారు 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు. కఠారి మోహన్‌కు శ్రీరామ్ చంద్రశేఖర్(చింటూ) మేనల్లుడు. వారి మధ్య వ్యక్తిగత, ఆర్థిక, రాజకీయ విభేదాల నేపథ్యంతోనే ఈ హత్య జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. పదేళ్లకు తీర్పు వచ్చిన ఈ కేసులో ఏకంగా 352 వాయిదాలు పడ్డాయి. 122 మంది సాక్షులను విచారించారు. A 1 నిందితుడు చంద్ర శేఖర్ ఏచింటూ, A 2 నిందితుడు వెంకట చలపతిఏ ములబాగల్ వెంకటేశ్, A 3 నిందితుడు జయ ప్రకాష్ రెడ్డి, A 4 నిందితుడు మంజునాథ్, A5 నిందితుడు వెంకటేశ్‌ఏ గంగన్న పల్లి వెంకటేశ్. వీళ్లలో ఏ3, ఏ4గా ఉన్న జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్.. అరెస్టు అయినప్పటి నుంచి జైలులోనే ఉన్నారు. తీర్పు నేపథ్యంలో చిత్తూరు పోలీసు బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ 30 యాక్ట్ అమలు చేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై,వాట్సప్ మెసేజ్ పై ప్రత్యేక నిఘా ఉంచారు.




## జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కేసు

- పార్టీ గుర్తుతో ఓటర్ స్లిప్పులు పంచుతున్నారని ఆరోపణ
- రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత మోహన్ రెడ్డి
- ఆర్వో ఆదేశాలతో కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కేసు నమోదైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న ఆరోపణలపై బోరబండ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. పార్టీ గుర్తుతో కూడిన ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుతో ఉన్న ఓటర్ స్లిప్పులను ప్రజలకు పంచుతున్నారని కాంగ్రెస్ మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఇది ఎన్నికల నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన నేరుగా రిటర్నింగ్ అధికారికి (ఆర్వో) లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత మోహన్ రెడ్డి చేసిన ఫిర్యాదును స్వీకరించిన రిటర్నింగ్ అధికారి, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఆర్వో ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన బోరబండ పోలీసులు, మాగంటి సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.



## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులు సుమారు 1,031 కోట్లు విడుదలయ్యాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లు కాగా.. పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ శాఖలో 46,956 బిల్లులకు సంబంధించిన నిధులను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షించిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు

## తెలంగాణలో ఎనిమిది మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో ఎనిమిదిమంది ఐఏఎస్‌లు బదిలీ అయ్యారు. ఈమేరకు ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సబ్యసాచి ఘోష్.. ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమ పథకాల స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ అయ్యారు.. ఈయనే వెల్ఫేర్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా కొనసాగుతారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న అనితా రామచంద్రన్.. వెల్ఫేర్ విభాగం కార్యదర్శి, గిరిజన సంక్షేమ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్మెంట్ శాఖ కార్యదర్శిగా ఉన్న ఇలంబర్తి.. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. బీసీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీధర్.. జీడీఏ పొలిటికల్ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. హార్టికల్చర్ %ు% సిరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న షేక్ యస్మీన్ బాషా.. ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మెట్రోపాలిటన్ ఏరియా %ు% అర్బన్ డెవలప్మెంట్ శాఖ కార్యదర్శిగా రామకృష్ణ రావు కొనసాగుతారుజితేందర్ రెడ్డి ఎస్సీ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శిగా ఉన్న సైదులు.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

## మావోయిస్టులను నిర్మూలించడం అసాధ్యం: చంద్రన్న

**మావోయిస్టు పార్టీలో నమ్మకద్రోహులు ఉన్నారన్న చంద్రన్న**

**బసవరాజు ఎన్‌కౌంటర్‌పై కోవర్ట్ ఆపరేషన్ అనుమానం**

**అనారోగ్య కారణాలతోనే అజ్ఞాతం వీడినట్లు వెల్లడి**

**45 ఏళ్ల తర్వాత డీజీపీ ఎదుట లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు**

**ఆపరేషన్ కగార్‌తో పార్టీని పూర్తిగా తుదముట్టించడం సాధ్యం కాదని వ్యాఖ్య**



మావోయిస్టు పార్టీలో కొందరు నమ్మకద్రోహులు ఉన్నారని, బసవరాజు ఎన్‌కౌంటర్ వెనుక కోవర్ట్ ఆపరేషన్ జరిగిందని మాజీ మావోయిస్టు, కేంద్ర కమిటీ సభ్యుడు పల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. 45 ఏళ్లుగా అజ్ఞాతంలో కొనసాగిన ఆయన, ఇటీవల తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టు పార్టీకి నష్టం వాటిల్లినప్పటికీ, పార్టీని పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మావోయిస్టులను లేకుండా చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. తాను ఆయుధాలు తీసుకుని మూకుమ్మడిగా లొంగిపోవడాన్ని సమర్థించనని, కేవలం తన అనారోగ్య కారణాలతోనే అజ్ఞాతం వీడానని చంద్రన్న స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడుకాపూర్‌కు చెందిన చంద్రన్న, 1979లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)తో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1980లో కిషన్‌జీ అనుచరుడిగా దండకారణ్యంలోకి ప్రవేశించి, 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2024 నాటికి కేంద్ర కమిటీ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర కమిటీకి మార్గదర్శకత్వం వహించారు. అయితే, దీర్ఘకాలిక మోకాళ్ల వ్యాధితో ఆరోగ్యం క్షీణించడం, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, పార్టీ నాయకత్వంతో ఏర్పడిన సిద్ధాంతపరమైన భేదాభిప్రాయాల కారణంగా ఆయన లొంగిపోయినట్లు డీజీపీ శివధర్ రెడ్డి ఇటీవల వెల్లడించారు. సుదీర్ఘకాలం పార్టీలో కీలక పాత్ర పోషించిన చంద్రన్న చేసిన ఆరోపణలు తాజాగా కలకలం రేపుతున్నాయి.

# ఛీ... ఛీ... మనిషేనా?

## మైనర్ బాలికను రూ.10 లక్షలకు అమ్మేసిన కన్నతల్లి!




న్యూ ఢిల్లీ బ్యూరో (క్రైమ్ మిర్రర్) : మానవత్వం ముక్కలైన సంఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. డబ్బు కోసం కన్నతల్లి సంతానాన్ని అమ్మేసిన షాకింగ్ ఘటన వెలుగులోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... తన తల్లి, ఇద్దరు అక్కలు కలిసి రూ.10 లక్షలకు అమ్మేశారని, బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టారని తెలిపింది. తాను ప్రతిఘటించడంతో కుటుంబసభ్యులే కొట్టి గాయపరిచారని బాధితురాలు వేదన వ్యక్తం చేసింది. బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు తల్లితో పాటు ఇద్దరు అక్కలను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను మహిళా శెల్టర్‌హోమ్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక దర్యాప్తులో, నిందితులు డబ్బు కోసం మైనర్ బాలికను వ్యభిచార గ్యాంగ్‌కు అప్పగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై మానవ అక్రమ రవాణా, మైనర్ అమ్మకం, దాడి, వేధింపు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానికులు ఆగ్రహంతో... తల్లి అనే పవిత్ర బంధం ఇలా అవమానానికి గురవ్వడం మనసును కలిచేస్తోంది. డబ్బు కోసం మానవత్వం అమ్ముకునే స్థాయికి దిగజారడం దుర్మార్గం

అని వ్యాఖ్యానించారు. ఈ ఘటన మానవ విలువలు, మహిళా భద్రతపై మళ్లీ పెద్ద ప్రశ్నలు లేవనెత్తింది.

## సీఎం ప్రజావాణి చొరవతో బాలిక సౌమ్యకు పునర్జన్మ

**రూ. 9 లక్షల ఆర్థిక సహాయం అందించిన సీఎం ప్రజావాణి**



హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రజావాణి చొరవతో బాలిక సౌమ్యకు పునర్జన్మ లభించింది. ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న సౌమ్యకు సీఎం ప్రజావాణి అండగా నిలిచి ఆ బాలిక చికిత్సకు అవసరమైన రూ. 9 లక్షలు ఆర్థిక సాయం సమకూర్చారు. శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణికి సౌమ్య తన తండ్రి తల్లిదండ్రులతో కలిసి వచ్చి సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలిపింది. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చల్లని దీవెనలు తన ఆయుష్షును పెంచిందని సౌమ్య సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణిలో సౌమ్యకు రూ. 4 లక్షల సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కును చిన్నారెడ్డి, దివ్య అందించారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టి ( సెర్ప్) నుంచి మరో రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని సౌమ్యకు అందించారు. జనగాం జిల్లా వెంకిర్యాల గ్రామానికి చెందిన ఈర్ల శ్రీనివాస్, అనురాధ తమ కుమార్తె సౌమ్య అనారోగ్య సమస్యను రెండు నెలల క్రితం సీఎం ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చారు. తల్లి అనురాధ స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు కాగా తండ్రి ఈర్ల శ్రీనివాస్ సన్నకారు రైతు. సౌమ్య దీనస్థితి గమనించి సీఎం ప్రజావాణి అండగా నిలిచింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు ఆసుపత్రిలో సౌమ్య శస్త్రచికిత్స విజయవంత మైంది.

## అజారుద్దీన్‌పై బీజేపీ విమర్శలు... కిషన్ రెడ్డికి మహేశ్ కుమార్ గౌడ్ సవాల్



**అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే బీజేపీకి అక్కసు ఎందుకని మండిపాటు**

**ఆయనపై ఏం కేసులు ఉన్నాయో సమాధానం చెప్పాలని నిలదీత**

**భారత జట్టు సారథిగా ఎన్నో విజయాలు సాధించారన్న మహేశ్ కుమార్ గౌడ్**

కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత కిషన్ రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. అజారుద్దీన్‌కి మంత్రి పదవి ఇస్తే బీజేపీ నేతలకు అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. ఆయనపై ఏం కేసులు ఉన్నాయో సమాధానం చెప్పాలని ఆయన కిషన్ రెడ్డిని నిలదీశారు. భారత జట్టు సారథిగా ఆయన ఎన్నో విజయాలను అందించారని అన్నారు. ఎంపీగా ప్రజలకు సేవ చేశారని తెలిపారు. అలాంటి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడాన్ని బీజేపీ నేతలు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మంత్రి పదవి ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని మూడు నెలల క్రితం తీసుకున్న నిర్ణయమని తెలిపారు. కాగా, తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు.

## ఆ ఇద్దరికి కీలక పదవులతో బుజ్జగింపు.. మంత్రివర్గ విస్తరణకు లైన్ క్లియర్



హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ విస్తరణ నేపథ్యంలో మంత్రి పదవులు ఆశించిన సీనియర్లకు అధిష్టానం బుజ్జగింపులు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా పి. సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. అలాగే.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుకు సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి కేబినెట్ బెర్త్ ఆశించారు. అయితే బదులుగా ఆయనకు సలహాదారు పదవి కట్టబెడుతూ ఆరు గ్యారెంటీల అమలు బాధ్యతను అప్పగించింది రేవంత్ ప్రభుత్వం. అలాగే.. ప్రేమ్‌సాగర్‌రావు కూడా కేబినెట్ అవకాశం కోసం ఆశలు పెట్టుకున్నారు. అయితే.. కేబినెట్ ర్యాంకు హోదాలో సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌ను కేటాయించింది. ఆశావహుల జాబితా నుంచి ఈ ఇద్దరూ అవుట్ కావడంతో మంత్రి వర్గ విస్తరణకు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల ప్రాధాన్యం, సామాజిక వర్గాల ప్రాధాన్యతను కాంగ్రెస్ అధిష్టానం పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

**రాజగోపాల్‌కు?**

ఇదిలా ఉంటే.. మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి నేపథ్యంలో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో బెర్త్ దక్కుతుందా? అనే ఆయన వర్గీయులు ఎదురు చూస్తున్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
ఎడిటోరియల్
4
శనివారం
1-11-2025

## ఎడిటోరియల్



ఊరికి ముందే ఉత్తరాంధ్ర వైసీపీ నాయకత్వం గూగుల్ డేటా సెంటర్‌కు వ్యతిరేక స్వరం వినిపించింది. అదో గోడౌన్ తప్ప ఉపయోగం లేదని ఒకరు, దానివల్ల వైజాగ్‌లో టెంపరేచర్ పెరుగుతుందని మరొకరు, అలాంటి ప్రాజెక్ట్ వస్తే%ా% ఇంకేదో జరిగిపోతుందని ఇంకొకరు%ా%. రకరకాలుగా కామెంట్స్ చేశారు. అదే సమయంలో ప్రభుత్వం సహజంగానే ఈ ప్రాజెక్ట్‌కు బీభత్సమైన ఎలివేషన్ ఇచ్చింది. వైసీపీ వాళ్ళకు సరిగా తెలియక ఏదేదో మాట్లాడుతున్నారుగానీ%ా% గూగుల్ డేటా సెంటర్ వల్ల వైజాగ్‌లో ఒక ఎకో సిస్టం డెవలప్ అవుతుందని, మిగతా సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడానికి రూట్ క్లియర్ అవుతుందని క్లారిటీ ఇస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఈ కన్ఫ్యూజన్‌లో%ా% ఎవర్ని నమ్మాలో అర్ధంకాని స్థితిలో ప్రజలు ఉండగానే%ా%. వైసీపీ అధినేత జగన్ తాజాగా మాట్లాడిన మాటల చుట్టూ కొత్త చర్చ మొదలైంది. ఓవైపు ఉత్తరాంధ్ర నాయకులు వ్యతిరేక కామెంట్స్ చేస్తే%ా% జగన్

# ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు... అత్యుత్సాహం...

మాత్రం డేటా సెంటర్స్‌కు అనుకూల స్వరం వినిపించారు. ఒకే ఇష్యూపై డిఫరెంట్ వెర్షన్స్ రావడంతో పార్టీ ప్రయోగించాలనుకున్న రాజకీయ అస్త్రం రివర్స్ అయిందా అనే చర్చకు తెరలేచింది. సరిగ్గా ఇదే పాయింట్‌ని వాడుకుంటూ%ా% సర్కార్ వైపు నుంచి కూడా ఆల్రెడీ అటాక్ మొదలైపోయింది. వైసీపీ నేతలు దాగుడు మూతలతో జనాన్ని మభ్య పెట్టవద్దంటూ ప్రభుత్వం ఎదురు దాడి స్టార్ట్ చేసింది. నువ్వా నేనా అన్నట్టుగా ఉండే పొలిటికల్ సిచ్యుయేషన్స్‌లో ఏ మాత్రం తడబడ్డా%ా% సంకట స్థితి తప్పదు. డేటా సెంటర్ల విషయంలో వైసీపీ ఇప్పుడు అదే స్థితిలోకి వెళ్ళిపోయిందా అంటూ మాట్లాడుకుంటున్నారు ఎక్కువ మంది. ఉద్యోగాలు, పర్యావరణ పర్యవసానాల చర్చల్ని కాసేపు అలా ఉంచితే%ా% అమెరికా బయట గూగుల్ ఇంత భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారి. లక్షా 30వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నట్టు ప్రకటించింది. దాన్ని బేస్ చేసుకునే%ా% విశాఖను ఏఐ సిటీగా మార్చేందుకు ఈ డేటా సెంటర్ పునాది అంటూ ప్రభుత్వం ప్రమోట్ చేస్తోంది. ఐతే%ా% ఇందులోకి క్రెడిట్ పాలిటిక్స్ ఎంటరవడంతో మేటర్ రసకందాయంలో పడింది. గూగుల్ డేటా సెంటర్ గురించి ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుంటోందని, వాళ్ళు చెబుతున్నట్టు లక్షల ఉద్యోగాలన్నది అభూతకల్పన అంటూ విభేదించారు ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు. ఆ విషయంలో కాస్త దూకుడు ప్రదర్శించి గట్టి స్టేట్‌మెంట్సే ఇచ్చేశారు. ఆ పొలిటికల్ గేమ్ అలా నడుస్తుండగానే%ా% తాజాగా మీడియాతో మాట్లాడిన పార్టీ అధ్యక్షుడు జగన్%ా% డేటా సెంటర్స్‌ని మేం వ్యతిరేకించడం లేదు, స్వాగతిస్తున్నామని ప్రకటించారు. పైగా అదానీ డేటా సెంటర్‌కు పునాది వేసింది వైసీపీనేనని క్లారిటీ ఇచ్చేశారాయన. దీంతో మేటర్ కీలక మలుపు తిరిగింది. పార్టీ హైకమాండ్ ఆలోచనలకు, ఉత్తరాంధ్ర నాయకత్వానికి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందా? లేక పార్టీ విధానం ఏంటో తెలుసుకోకుండా వాళు ళ తొందరపడ్డారా అన్న అనుమానాలు వస్తున్నాయట పరిశీలకులకు. వాస్తవంగా%ా% విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటు దిశగా తొలి అడుగు వైసీపీ హయాంలోనే పడింది. మధురవాడ ప్రాంతంలో300 మెగావాట్ల అదానీ డేటా సెంటర్‌కు 2023లో సీఎం హోదాలో శంఖు స్థాపన చేశారు జగన్మోహన్‌రెడ్డి. కేవలం డేటా సెంటర్ ఒక్కటే కాకుండా ఐటీ అనుబంధ పెట్టుబడులు పెట్టే విధంగా అప్పట్లో ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. అయితే%ా% ప్రస్తుతం గూగుల్ ఏర్పాటు చేయబోతున్నది ఒక గిగావాట్ కెపాసిటీ. స్టోరేజ్ సామర్థ్యం, పెట్టుబడి పరంగా రెండు ప్రాజెక్టల మధ్య పొంతన లేకున్నా%ా% ఇదే విశాఖలో డేటా సెంటర్‌కు వైసీపీ హయాంలో శంకుస్థాపన జరిగిందన్నది మాత్రం వాస్తవం. ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు ఆ సంగతి మర్చిపోయి గూగుల్‌పై విమర్శలు చేసి తొందర పడ్డారా అన్న చర్చలు మొదలయ్యాయి రాజకీయవర్గాల్లో. గూగుల్‌కు తాము వ్యతిరేకం కాదంటూనే%ా% డేటా సెంటర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో%ా% ప్రభుత్వం కూడా ఎదురు దాడి ప్రారంభించింది. వైసీపీ అభివృద్ధికి వ్యతిరేకం కనుకనే గూగుల్‌ను ఆహ్వానించడానికి మనసు రావడం లేదని, ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్నారు అధికారపక్ష నేతలు. మొత్తం మీద ఈ విషయమై వైసీపీలో కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న విషయం మాత్రం అర్థమవుతోందని అంటున్నారు పరిశీలకులు.

ఓటరు నమోదు ప్రక్రియలో లోపాలను సరిచేయడంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికీ పక్కా ప్రణాళిక లు చేపట్టడం లేదు. ఆధార్ తరహాలో పర్మినెంట్ నంబర్ వచ్చేలా, మార్పులు చేర్పులు చేసుకునేలా వ్యవస్థను పటిష్టం చేయడం లేదు. సాంకేతికంగా ఇంతగా అభివృద్ధి చెందిన దశలో ఇసి సాంకేతికతను అందిపుచ్చుకోవడం లేదు.



# ఓటర్ల జాబితా సవరణలు అవసరమే !

బీహార్‌ల చేపట్టిన ఓటర్ల సవరణ సర్ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే అందులో విపక్ష కాంగ్రెస్ పార్టీ కుట్రకోణం కూడా ఉంది. ఓట్లను తొలగిస్తే ప్రజలు తిరుగుబాటు చేయాలి. తమ ఓట్లు గల్లంతు అయ్యాయని చెప్పాలి. కానీ ఎక్కడా ఇలాంటి ఆరోపణలు రాలేదు. ఒకవేళ ఒకటిరెండుచోట్ల వచ్చినా, స్థానిక అధికారులను కలిసి వారు తమ ఓటును పునరుద్దరించుకున్నారు. పెద్ద మొత్తంలో ఓట్లు గల్లంతు అయినట్లుగా ..ఓట్ చోరీ గురించి ఆరోపణలు చేసి, అభాసుపాలయిన రాహుల్ గాంధీ ఎక్కడా ఓట్ల గల్లంతుపై ఒక్కటంటే ఒక్క అఫిడవిట్ దాఖలు చేయలేకపోయారు. సుప్రీం కూడా ఇదే సూచించింది. ఓట్లు గల్లంతయిన వివరాలను సమర్పించాలని కోరితే రాహుల్ ఇప్పటికీ ముందుకు రాలేకపోయారు. అంటే ఇందులో ప్రచారయావ తప్ప నిజాలు లేవని తెలుస్తోంది. ఈ క్రమంలో దేశంలోని మరికొన్ని రాష్ట్రాల్లో సర్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. దేశంలో చనిపోయిన వారి ఓట్లతో పాటు అక్రమంగా చొరబాటు ద్వారా వచ్చిన వారి ఓట్లను గుర్తించి తొలగించాల్సిందే. ఇందులో ఎలాంటి రాజీపడాల్సిన అవసరం లేదు. మన ఓటర్ల జాబితాలో దేశ విద్రోహశక్తులు చేరి, మన ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే చర్యలు వ్యతిరేకించాల్సిందే. రోహింగ్యాలు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి తిష్టవేసిన వారి ఓట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించాల్సిందే. ఎన్నికల పక్రియకు రెండు నెలల ముందు బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో అత్యున్నత న్యాయస్థానంలో పలు కేసులు దాఖలయ్యాయి. విచారణ చేపట్టారు. ఓట్ల తొలగింపు ఆధారాలు చూపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని విపక్షనేత రాహుల్‌కు సుప్రీం సూచించింది. అయితే దీనిపై ఆయన ఒక్క అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. ప్రస్తుత దశలో వివిధ రాష్ట్రాల్లో 51 కోట్ల మందిపైగా ఓటర్ల వివరాలు నిగ్గుతేల్చే ఎస్ఐఆర్‌ను చేపట్టడం ప్రజాస్వామ్యం పట్ల నిబద్దతను చాటుకోవడంగానే చూడాలి. ఈ వ్యవహారంలో రాజకీయ పార్టీలు తప్పుదోవ పట్టించే ప్రకటనలు మానాలి. స్థానిక సంస్థలకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎస్ఐఆర్ చేపట్టవద్దని కేరళ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదే. ఇది ఓ రకంగా ఓఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుంది. ఎవరు ఓటరో కాదో తేల్చుకునే బాధ్యత ఎన్నికల సంఘానిదే. ప్రసాజ్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయడం అత్యవసరం. ప్రజలు తమ ఉపాధి, విద్య, ఉద్యోగం తదితర అవసరాల కోసం అనేక ప్రాంతాలకు వెళుతుంటారు. కొంతమంది చనిపోవడం, 18 ఏళ్లు నిండినవారు కొత్తగా నమోదు కావడం కూడా జరుగుతుంది. ఈ క్రమంలో ఓటర్ల జాబితా ఆధునీకరణ పక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా, రాజకీయ పక్షపాత రహితంగా, అనుమానాలకు తావివ్వని విధంగా చేపట్టాల్సిందే. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిది. వాటిని నిర్వహించే ఎన్నికల కమిషన్ ఈ వ్యవస్థను బలోపేతం చేస్తూ పోవాల్సిందే. అయితే శేషన్ లాంటి వారు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో పారదర్శక ఎన్నికలకు అవకాశం ఏర్పడింది. ఆ తరవాత ఎన్నికల కమిషనర్లుగా వచ్చిన వారెవ్వరూ శేషన్ అడుగుజాడల్లో

నడవలేదు. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే విధానాన్ని మోడీ ప్రభుత్వం మార్పు చేసింది. సిజెఐని తొలగించి, ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఈ విధానం సరికాదని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీకి అనుచితమైన అధికారం ఉండకూడదని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెడుతూ పార్లమెంటులో చట్టం చేసింది. బీహార్ ఎస్ఐఆర్ పక్రియపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వనే లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టడం వల్ల కొందరికి అనుమానాలు రావచ్చు. కానీ ఓటర్ల జాబితాలను నవీకరించుకోవాలన్న సంకల్పాన్ని నిలదీయలేం. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఏవైనా అభ్యంతరాలను పక్కన పెడితే నిలదీయాలి. అర్హులైన వారి ఓట్లు గల్లంతయితే అడగాలి. అంతేగానీ ప్రక్రియను చేపట్టడాన్ని నిలదీయడం లేదా బహిష్కరించడం ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. సర్ ప్రక్రియ సక్రమంగా సాగడానికి, పారదర్శకంగా జరగడానికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు తోడ్పాటును అందించాలి.

# ఎంత కష్టం.. ... ఎంత నష్టం...

ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండానే నాశనమయిపోయింది. 243 మండలాల్లో తీవ్ర పంటన నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంట నేలవాలింది. అరటి, బత్తాయి వంటి తోటలు పూర్తిగా ఈదురుగాలులకు ధ్వంసమయ్యాయి. మిరప, పత్తి రైతులు నష్టపోయి కూడా ఆందోళన చెందుతున్నారు. కంది, అరటి, బొప్పాయి, వేరుశెనగ వంటి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. 22 రెండు జిల్లాల్లో మొంథా తుపానుతో భారీగా పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతి వరకూ అన్ని జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాధమికంగా అంచనా వేశారు... వరి సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. భారీ వర్షాలకు, ఈదురుగాలులకు వరిపంట దెబ్బతినింది. డెల్టా ప్రాంతంలో సాగవుతున్న వరి నేలకొరిగింది. వరి ప్రస్తుతం కంకుల దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తున్న దశలో భారీ వర్షం, గాలులకు పంట దెబ్బతినింది. మరో పదిహేను రోజుల్లో పంట చేతికి వస్తుందనుకుంటున్న దశలో నష్టం వాటిల్లినట్లు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంటపై ఆశలు వదులుకోనున్నారు. వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు ఇక కోలుకోలేని పరిస్థితి నెలకొంది. పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. పెట్టుబడి వచ్చే అవకాశం కూడా కనిపించడం లేదు. . వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో పంట పూర్తిగా నాశనయినట్లేనని అన్నదాతలు విలపిస్తున్నారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఈదురుగాలులు కూడా బలంగా వీస్తాయని, గంటకు అరవై నుంచి డెబ్బయి కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నందును ఎవరూ వీలయినంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని



అధికారులు కోరుతున్నారు. వాగులు, నదులు దాటే ప్రయత్నం ఎవరూ చేయవద్దని, అలాగే ప్రయాణాలు కూడా వీలయినంత మేరకు మానుకోవాలని సూచించింది. ఈదురుగాలులు వీస్తూ... మొంథా తుపాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు పడుతున్నాయి. గాలుల తీవ్రత కూడా పెరిగింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. తుపాన్ ప్రభావంతో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. తీర ప్రాంతాల్లో పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. తుపాన్‌గా బలహీనపడుతున్న మొంథా రానున్న ఆరు గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాకఖ తెలపింది. ఆంధ్రప్రదేశ్ లోని 12 జిల్లాలకు భారీ వర్ష సూచన చేంది. తొమ్మిది జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచనచేసిదరి. 9శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఎకరాకు ముప్పయి నుంచి నలభై వేల రూపాయలు నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, కంది, బొప్పాయి, బత్తాయి వంటి పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో అన్నదాతలు కోలుకోవడం కష్టమేనని అనిపిస్తుంది. ప్రభుత్వం పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించింది. అయినా ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం వీరి నష్టాన్ని ఏమాత్రం పూడ్చలేదన్నది మాత్రం వాస్తవం.

# ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ వేడుకలు




**గండిపేట(క్రైం మిర్రర్):** కార్మికుల శ్రేయస్సు కోసం పోరాడుతూ వారి సమస్యల ఉద్యమిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.మల్లేష్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న భారత దేశంలో ఏఐటీయూసీ ఆవిర్భావించిందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కార్మికులకు అండగా కష్టజీవులకు అండగా దోపిడి దారులకు వ్యతిరేకంగా కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న వారికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. పరిశ్రమలలో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కనీస వేతనాలు 26 వేలు నిర్ధారించి అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిపి కొట్టాలని అన్నారు. జెండా ఆవిష్కరణలో ఎం.బాబురావు, బిటిసి మండల కార్యదర్శి శ్రీకాంత్, ప్రకాష్, శ్రీరాము, ప్రభు, లక్ష్మి, మాదేవి, చిన్న, రాము, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైదర్‌గూడ చౌరస్తాలో ఘనంగా సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి



గండిపేట(క్రైం మిర్రర్): అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని సర్ధార్ వల్లభాయ్ చౌరస్తా హైందరనగర్‌లో నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిరవ్హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ పాల్గొని పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ సర్ధార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర సమరయోధుడు ఉక్కుమనిషి , రైతు ఉద్యమకారుడు, మొదటి ఉప ప్రధాని హెూంశాఖ మాత్యులు 560 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనత వారికే దక్కిందన్నారు. నైజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన ఘనత వారికే దక్కిందన్నారు. సర్ధార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడామీ శివరాంపల్లిలో స్థాపించి దేశానికి ఐపీఎస్ అధికారులను అందించే సంస్థ మన దగ్గరనే ఉండడం వెల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొమురయ్య, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనట్ మల్లేష్‌యాదవ్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు నర్సింహ్మా, బి.మల్లారెడ్డి, జయానంద్‌రెడ్డి, ఎన్.రమేష్, జి.రాజు, వెంకట్‌రెడ్డి, వాసు, ఎం.జగన్, వనితరెడ్డి, ఉమ, సరిత, గాయత్రి, అనిల్, మణికంట, శ్రీకాంత్‌చారి, సాయియాదవ్, నరేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్, సహదేవ్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, పాండుయాదవ్, రవీందర్‌రెడ్డి, అమన్, రవి, సుధాకర్‌రెడ్డి, వరద రాజ్‌రెడ్డి, రాములు, ప్రవీణ్, ముఖేష్, లకన్, బాలకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరాంనగర్ ఎంపీపీఎస్‌లో స్వచ్ఛతా పక్వాడ

గండిపేట(క్రైం మిర్రర్): శ్రీరాంనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో స్వచ్ఛతా పక్వాడా ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కమిటీ చైర్మన్ ఎస్.కె.అల్లావలీనర్ ఆధ్వర్యంలో గోన్గ స్వచ్ఛంద సంస్థ వారు పాఠశాల స్వచ్ఛతా ప్రొగాంలో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేసి విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, కలర్ పెన్సిళ్లు, బహుకరించారు. ఈ కార్యక్రమంలో దుర్గా, సూమెన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శంకర్, లతా, ఆశాజ్యోతి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పారిజాత నరసింహ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జూబ్లీహిల్స్ నియెజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి మద్దతుగా రెహ్మత్ నగర్ లోని 103వ బూత్ లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి.జూబ్లిహిల్స్ అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరడం జరిగింది. అనంతరం మాజీ క్రికెటర్ అజారుద్దీన్ మంత్రిగా పదవి చేపట్టిన సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచ కాల్చి సంబరాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, రాకేష్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నీళ్ల లింగస్వామి గౌడ్ ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 31(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నీళ్ల లింగస్వామి గౌడ్ గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శుక్రవారం వారి నివాసంలో లింగస్వామి గౌడ్ ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి ఈ కార్యక్రమంలో అందె యాదయ్య, చిలువేరు అంజయ్య, దూసరి వెంకటేష్ గౌడ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, గునిగంటి రాజు గౌడ్, రిపోర్టర్ సింగం కృష్ణ, బానోతు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గర్దాసు చంద్రకళ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి





**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 31(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన గర్దాసు చంద్రకళ గత వారం అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం వారి నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అందే యాదయ్య యాదవ్, చిలువేరు పాల అంజయ్య, దూసరి వెంకటేశం గౌడ్,గునిగంటి రాజు గౌడ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ యువజన ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, పత్రికా విలేఖరి సింగం కృష్ణ, చిలివేరు శ్రీశైలం, బానోతు కిరణ్ నాయక్ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# మెగా రక్తదాన శిబిరానికి భారీ స్పందన: పోలీస్ కమిషనర్

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ అమరవీరులో వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం రూరల్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నేలకొండపల్లి మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి 1,500 మందిపైగా దాతల నుంచి రక్తం సేకరించారు.. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారని, ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. తలసేమియా రోగులకు ప్రతి15 రోజులకు ఒకసారి రక్తం అవసరం అవుతుందని, అందు కోసమే అమరవీరుల త్యాగాలకు నివాళిగా ఈ మెగా రక్తదాన శిబిరం ఏర్పాట చేసినట్లు తెలిపారు.ఈ శిబిరాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ఖమ్మం రూరల్, ముదిగొండ, కూసుమంచి, నేలకొండపల్లి మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, సిఐ లు మురళి, రాజు, సంజీవ్,సాగర్, నేలకొండపల్లి ఎస్ ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీలోని భారతీయ జనతా పార్టీ శాఖ కార్యాలయంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను గుర్తు చేస్తూ స్వాతంత్ర భారతంలో సంస్థానాల విలీనానికి ముందడుగు వేసిన ధీరుడు దేశ సమైక్యతకు భీజం, వేసిన నాయకుడు ఉక్కుమనిషి బిరుదాంకితుడు సర్ధార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యతను చాటి చెప్పిన మహెూన్నత వ్యక్తి జాతీయ ఐక్యత దినోత్సవం జరుపుకుంటున్న వేల ఆయన సేవలను గుర్తు చేసుకోవడం జరిగడింది. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకల్ల నరేందర్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, వందన నాగేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు జోన్నాడ లక్ష్మి, సి.హెచ్.ఇందిరా, చిలుకూరి బీరప్ప, ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, వినోద్, కోశాధికారి యాదయ్య, వైస్ ప్రెసిడెంట్ ఆనందరావు, రాజేష్, ఓరిస్‌మధు, శంకర్, బి.శివకుమార్, మురళీ, భీమ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గణేష్, రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు

గండిపేట(క్రైం మిర్రర్): మహాత్మ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఎన్‌ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎక్తా రన్ ఫర్ యూనిట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. భారతదేశంలో 500పైగా ఉన్న సంస్థాలను విలీనం చేసి, ప్రస్తుతం భారతదేశ చిత్ర పటానికి కారుకులైన సర్ధార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన సభ సందర్భంగా ఆయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సుమారు 1000 మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శనివారం 1-11-2025

# యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి




**గండిపేట(క్రైం మిర్రర్):** యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోని వారి అడుగు జాడల్లో నడవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 143 పటేల్ చౌరాస్త వద్ద సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ సమైక్యతకు చోదక శక్తిగా ఆయన నిలిచానరన్నారు. తద్వారా మన దేశం నిర్మాణాత్మక సంత్సరాలల్లో దాని విధిని రూపొందించారన్నారు. జాతీయ సమగ్రత, సుపరిపాలన, ప్రజా సేవ పట్ల ఆయన అంచనలమైన నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందన్నారు. ఐక్యమైన, బలమైన, స్వావలంబన భారతదేశం అనే ఆయన దార్శనికతను నిలబెట్టాలనే మా సమిష్టి సంకల్పాన్ని కూడా మేలు పునరుద్ఘాటిస్తున్నామన్నారు. వజ్ర సంకల్పంతో దేశాన్ని ముక్కలు కాకుండా సంస్థానాలన్ని ఒక్కటిగా దేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి ఆటంకాలెన్ని ఎదురైనా తన వాళ్లే తనకు పెను సవాళ్లు విసిరినా మొక్కవోని దీక్షతో దేశం కోసమే పని చేసిన ప్రజల మనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, జగన్, వినయ్, బాబురావు, వాసు, వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో ప్రజలంతా సహకరించాలి

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్

గండిపేట(క్రైం మిర్రర్): అభివృద్ధి పనుల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సహకారంతో 25 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించార. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్, కళ్లెం లక్ష్మారెడ్డి, అనిల్‌ముదిరాజ్, అంజిగౌడ్, స్వామిగౌడ్, వెంకటేష్, సి.హెచ్.గోపాల్, మహేష్‌గౌడ్, మన్నెపురెడ్డి, గోపాల్, ఉపేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్.



**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 31(క్రైమ్ మిర్రర్): యాదాద్రి భువనగిరి జిల్లా:** సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన వడ్డేపల్లి లింగమ్మ, కంకణాలగూడెం గ్రామనికి చెందిన సిరిపంగి నర్సమ్మ వీరు ఇద్దరు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు అనే విషయం ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ భాస్కర్ అన్నకు తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించి ఇద్దరికీ నెల రోజులు సరిపడా మందులు ఇప్పించడం జరిగింది ఈ యొక్క మెడిసిన్ ను ఫౌండేషన్ సభ్యులు వారికి అందించారు ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్, ఓర్సు విజయ్,ఎలిజల శ్రీను,పట్నం బాలకృష్ణ, మహేష్, జనగాం సతీష్, శంకర్, బద్దం రాజు, కడారి రాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



**చౌటుప్పల్.అక్టోబర్ 31. క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ 41వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, జిల్లా నాయకులు పబ్బు రాజు గౌడ్ లు పాల్గొని స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వర్గీయ మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ గరీబ్ హటావో నినాదంతో హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు కూడు, గూడు కల్పించి భూములు ఇచ్చి పేదరిక నిర్మూలన కోసం కృషి చేసి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగొనీ అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మునిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మాజీ సర్పంచులు, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# పటాన్ చెరు-దౌల్తాబాద్ రోడ్డు ను బాగు చెయ్యండి

## సిపిఎం పార్టీ ఏరియా కమిటీ బి నాగేశ్వరరావు డిమాండ్





**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 31:** పటాన్ చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టి నాలుగు లైన్ల రోడ్డుగా నిర్మాణం చేయాలని సిపిఎం పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంద్రేశం నుండి దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో పూర్తిగా ధ్వంసం అయ్యిందని అన్నారు. ఈ రోడ్డు గత రెండు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉన్నదని అన్నారు. గతంలో చిన్నపాటి గుంతల మరమ్మతులు చేపట్టినప్పటికీ ఒక వర్షానికి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. ఈ ఇంద్రేశం రోడ్డు మీదిగా ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భారీ లోడుతో వాహనాలు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగిస్తున్నాయని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా జరుగుతుండడంతో ఈ ప్రాంతమంతా ఇసుక, ఇటుక, కంకర, డస్ట్ భారీ లోడులతో వాహనాలు తీసుకెళ్తున్నాయని అన్నారు. ఆరోబింద్ కౌంటీ, కంకర క్రషర్ల వద్దకు వాహనాలు వెళ్తున్నాయని అన్నారు. ఇంద్రేశం, రామేశ్వరం బండ, పిఎన్ఆర్ టౌన్షిప్, మహాదేవపురం, జర్నలిస్ట్ కాలనీ, సాయి, సిటిజన్ కాలనీ, నవ్య నగర్ లతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం అని అన్నారు. ఐనోలు, పెద్ద, చిన్న కంచర్ల లు, శివానగర్, సోల్లపల్లి, బేగంపేట, చింతల్ చెరు, వడ్డేపల్లి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అన్నారు. ఈ ప్రాంతం మీదుగా మన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఎన్నో సందర్భాల్లో ప్రయాణిస్తున్నప్పటికీ, కనీసం చీమకుట్టినట్లు కూడా అనిపించడం లేదని అన్నారు. ఇంద్రేశం ప్రాంతంలో ఉన్న బిల్డర్ల వద్ద కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ గుంతల రోడ్డుకుప్యాచ్ వర్క్ పూర్తి చేశారని అన్నారు. ఇంద్రేశం ప్రాంతంలో ఉన్న ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని నాలుగు లైన్ల రోడ్డుగా నిర్మాణం చేయాలని డిమాండ్ చేయాలని అన్నారు. ఇప్పటికే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేసామని, వెంటనె మరమ్మతులు చేయక పోతే వచ్చే వారంలో నిరాహార దీక్ష చేస్తామని జిల్లా అధికారులను హెచ్చరించారు.




# డిగ్రీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ విజయవంతమైంది. ఈ సందర్భంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ( టాస్క్) సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు కెరీర్ అవకాశాలు, స్కిల్ డెవలప్మెంట్, ఉద్యోగావకాశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు రిజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ ప్రిపరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ వంటి అంశాలపై మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరచుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలను పొంది, తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు వారి కెరీర్ ప్లానింగ్ లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. టాస్క్ సంస్థకు ధన్యవాదాలు తెలుపుతూ, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల సంక్షేమానికి కృషిచేసిన గొప్ప మహనీయురాలు ఇందిరా గాంధీ

## డిసిసి ఉపాధ్యక్షులు -మందు గుల్ల బాలకృష్ణ



**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 31(క్రైమ్ మిర్రర్):** స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక బస్టాండ్ లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశం కోసం గ్రామీణ ప్రాంతాల కోసం భూసంస్కరణలు తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాలకు భూమిని పంచిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనాని అన్నారు. రాజభరణాల రద్దు బ్యాంకుల జాతీయకరణ, ఎస్సీ ఎస్టీల సముద్ధరణ కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చి భారతదేశంలో అట్టడుగు వర్గాల సంక్షేమానికి కృషిచేసిన గొప్ప మహనీయురాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్, డిసిసిబి మాజీ డైరెక్టర్ ఏర్పుల సుదర్శన్, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు చిలువేరు కృష్ణ,బీసీ సెల్ మండల అధ్యక్షులు రత్తిపల్లి యాదయ్య, అందే యాదయ్య యాదవ్,గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల లింగస్వామి, గునిగంటి రాజు గౌడ్,బద్దుల యాదగిరి యాదవ్, మాజీ వార్డు మెంబర్ బొమ్మర బోయిన రవికుమార్, బోయ సత్యం, నేనవత్ జలంధర్ నాయక్,బలుగూరి శివ సాగర్, గొల్లూరి నవీన్ సాగర్, చిలువేరు అంజయ్య, ఏపూరి శివయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యతకు ప్రతీకగా రన్ ఫర్ యూనిటీ: సీఐ నాగార్జున






**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని కల్వకుర్తి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు పట్టణంలోని పాలమూరు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం నుంచి 2%ఖ% ప్రారంభమయ్యే హైదరాబాద్ చౌరస్తా, కూరగాయల మార్కెట్, శివాజీ చౌక్ మీదుగా పాలమూరు చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ నాగర్జున మాట్లాడుతూ.. ఈ రన్ ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆలోచనలు ఏకతా స్ఫూర్తి ప్రజల్లో ప్రతిధ్వనించాలన్నారు. అలాగే సమాజంలో ప్రజల శాంతిభద్రతను పరిరక్షించడానికి, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ 2కె రన్ లో కల్వకుర్తి సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని సీఐ నాగార్జున అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి, సబ్ డివిజన్ ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, కల్వకుర్తి స్పోర్ట్స్ క్లబ్, యూత్ క్లబ్స్, మానవతా ఫౌండేషన్, మిత్ర ఫౌండేషన్, మార్నింగ్ వాకర్స్, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మాజీ మంత్రి హరీష్‌రావును పరామర్శించిన మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కిగౌడ్

**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును టీపీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీఎంపీ మధుయాష్కీగౌడ్ పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మంగళవారం మరణించిన నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం మణికొండ లోని పుప్పాలగూడలో క్రిన్స్ విల్లాస్‌లోని హరీష్‌రావు నివాసానికి వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరీష్‌రావుని పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

## అతివేగంతో అదుపు తప్పి ద్విచక్రవాహనం..వ్యక్తి మృతి

**క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్ ప్రతినిధి:** ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే అంబట్ పల్లి గ్రామానికి చెందిన పురోహితులు నాగేశ్వర శర్మ (40) మహాదేవ్ పూర్ నుండి అంబట్ పల్లి కి వెళు తున్న క్రమంలో సూరారం ములమాలువు వద్ద అదుపు తప్పి కిందపడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



# విద్యార్థి దశ నుండే సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి - డి.వై.ఎస్.ఓ





**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా :** గాయత్రీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రఘువాపురం గ్రామం చింతకాని మండలం నందు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సునీల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. చివరి రోజు గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్, మహిళ సాధికారత, మహిళల పై జరుగుతున్న అఘాయిత్యాల పై పోస్టర్ పెయింటింగ్ ద్వారా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముగింపు సభలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని, ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకున్న కూడా సేవ కార్యక్రమాలు మరువకూడదన్నారు. సమాజంలోని రుగ్మతలను మార్చగలిగే సామర్థ్యం యువతకు మాత్రమే ఉందన్నారు. ప్రత్యేక శిబిరంలో పాల్గొని ఉత్తమ వాలంటీర్ గా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ గ్రామ మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ కుతుంబాక సునీల్ కుమార్, డైరెక్టర్ సీతారామయ్య, కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ జయప్రద కళాశాల అధ్యాపకులు ఉమా శంకర్, ఉపేందర్, శ్రీనివాస్, నరసింహా రావు, సౌమ్య, జ్యోతి, నాగమణి, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణన్న

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని విజయచంద్ర ఫంక్షన్ హాల్ లో ఘణపూర్ గ్రామానికి చెందిన శేఖర్ గౌడ్ సోదరుని వివాహ వేడుకల్లో పరిగి నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి మారుతి కిరణ్ బూనేటి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గణపురం రామచంద్రయ్య, ఆంజనేయులు, రాములు, బీరప్ప వెంకట్ రాములు, మోహన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పా జంక్షన్ -మన్నేగూడ నాలుగు లైన్ రోడ్ పనులకు గ్రీన్ సిగ్నల్

## కోర్టు స్టే ఎత్తివేతతో రోడ్డు పనులు ప్రారంభం - ఎమ్మెల్యే రాంమ్మోహన్ రెడ్డి



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు శుక్రవారం నుంచి ప్రారంభమైన అని వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి చేవెళ్ల క్యాంప్ ఆఫీస్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంమ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,అప్పా జంక్షన్ నుండి మన్నేగూడ వరకు రూ.1000 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు లైన్ రహదారి పై గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న కేసు విచారణలో, కేవలం 150 మర్రి చెట్లను మాత్రమే తొలగించి ఇతరచోట నాటాలని నిర్ణయించడంతో కోర్టు స్టే ఆర్డర్ ఎత్తివేసిందని తెలిపారు. గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నను ప్రత్యేకంగా చొరవ తీసుకొని గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించమని సూచించడం జరిగిందన్నారు. నేను పలుమార్లు "గ్రీన్ ట్రిబ్యునల్ వారితో చర్చలు జరిపి,వారిని సీఎం కార్యదర్శి దగ్గరికి తీసుకెళ్లి నిర్విరామంగా చర్చ జరపడం జరిగిందని,దాని ఫలితంగానే నేడు కోర్టులో కేసు స్టే తొలగించడం సాధ్యమైంది అని ఎమ్మెల్యే రాంమ్మోహన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో శుక్రవారం నుంచే రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, త్వరితగతిన పూర్తి చేసి ప్రమాదాలను తగ్గిస్తామని చెప్పారు. అదేవిధంగా ట్రిబుల్ ఆర్, రేడియం రోడ్లు హం పథకం ద్వారా ప్రతి గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# జాతీయ స్థాయిలో రిజర్వేషన్లపై విధించిన పరిమితిని ఎత్తివేయకపోతే నవంబర్ లో పార్లమెంటును ముట్టడిస్తాం

## బీసీల పోరాటాలతోనే గల్లీ నుండి ఢిల్లీ వరకు కులగణన జరుగుతుంది

## కులగణంకాల ఆధారంగా బీసీల వాటా బీసీలకు ఇవ్వాల్సిందే

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో బిసి రిజర్వేషన్లు పెంచేవరకుజాతీయస్థాయిలో ఉద్యమిస్తాం

## బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత ఇండియా, ఎన్డీఏ కూటమిలే బాధ్యత తీసుకోవాలి

## బీసీ సంక్షేమ సంఘం

## జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ అధ్యక్షులు కేసన శంకర్రావుల డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 31(క్రైమ్ మిర్రర్):** సుప్రీంకోర్టు విధించిన బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లపై 50% పరిమితిని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం చేసి పరిమితిని ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు లు డిమాండ్ చేశారు. హైదరాబాదు లోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన చేపట్టాలని, ఇదే సమయంలో ఇటు తెలంగాణలో అటు ఆంధ్రప్రదేశ్లో కూడా సమగ్ర కులగలను చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామస్ ప్రకారం పెంచాలని తాము చేసిన పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో కులగరణ జరిగిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఇటీవల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే సమగ్ర కులగనన చేపడతామని ప్రకటించడం జరిగిందని వారు వెల్లడించారు. అలాగే బీసీ సంఘాలు చలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా ఢిల్లీలో పార్లమెంటు ముందు వందల సార్లు ధర్నాలు ర్యాలీలు ముట్టడిలు తదితర తీవ్రమైన ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని రాష్ట్రపతి భవన్, కేంద్ర మంత్రుల ఇండ్లను ముట్టడించామని, దీనితో కేంద్ర ప్రభుత్వం కూడా దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగనన చేపడతామని ప్రకటించిందని ఇది వంద శాతం బీసీ సంఘాలు చేసిన పోరాట ఫలితమేనని వారు తెలిపారు. కులగనన చేయడం, బీసీల లెక్క తేల్చడం బీసీల పోరాట పాక్షిక విజయమని, కులగనన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచినప్పుడే, దేశంలో ఉన్న సామాజిక రిజర్వేషన్ల 50% పరిమితులు ఎత్తివేసినప్పుడే బీసీలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. బీసీ రిజర్వేషన్లను పెంచాలని, 50% పరిమితిని ఎత్తివేయాలని, మహిళా బిల్లు లో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాల నే ప్రధాన డిమాండ్ నవంబర్ 25వ తేదీ నుండి జరిగే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు సందర్భంగా వేలాది మందితో ఢిల్లీకి తరలి వెళ్లి పార్లమెంటును ముట్టడిస్తామని వారు హెచ్చరించారు బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత దేశంలో ప్రధాన రాజకీయ కూటములైన ఎన్డీఏ, ఇండియా కూటములే బాధ్యత తీసుకోవాలని, ప్రధాని నరేంద్ర మోడీ, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లను ఢిల్లీలో కలిసి బీసీ రిజర్వేషన్లపై ఒత్తిడి తీసుకువస్తామని వారు తెలిపారు. బీసీ డిమాండ్లపై తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, గోవా, చతిస్గడ్, హర్యానా, యూపీ, బీహార్, తమిళనాడు, రాష్ట్రలలో అనేక సభలు సమావేశాలు నిర్వహించామని, అవసరమైతే బీసీ డిమాండ్లపై కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టి బీసీల ఆకాంక్షలను ఢిల్లీకి వినిపిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్, కేసన శంకర్రావు లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వకాధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర, బీసీ కుల సంఘాల జేఏసీ కోఆర్డినేటర్ శేఖర్ సగర, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్, బీసీ నేతలు గూడూరు భాస్కర్ మేరు, నరసింహ చారి, యామ మురళి, ఆరూరు వెంకటేశ్వర్లు, మధు యాదవ్, వీరభద్ర చారి, శ్రీనివాసచారి, అనిల్ గౌడ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు





## సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

**చౌటుప్పల్, అక్టోబర్ 31(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధి పంతంగి గ్రామంలో భారత తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. శుక్రవారం పటేల్ జయంతి సందర్భంగా గ్రామంలోని కొత్తకాలనీ ట్యాంక్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారూ. కార్యక్రమంలో బాతరాజు ఆగయ్య, చినుకని మల్లేశం,గరిశే ఐలయ్య, మిర్యాల రవి, తొర్పునూరి దయాకర్, చినుకని యువరాజు,బాతరాజు వెంకటేష్,బండ శేఖర్,బర్మ నాగరాణి, గుండెపురం నరేష్,మిర్యాల సంతోష్, పల్లె వెంకటేష్, బాతరాజు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికతనికి

### సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### డి ఎం హెచ్ ఓ - డాక్టర్ పుట్ల శ్రీనివాస్



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నల్లగొండ జిల్లా డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రాథమిక వైద్య కేంద్రంలోని మెడిసిన్ స్టాక్, తదితర రిజిస్టర్లని పరిశీలించి, ప్రతి రోజు వివిధ రుగ్మతులతో రోగులకి అందుతున్న వైద్య సేవలని మండల ప్రభుత్వ వైద్యాధికారులైన డా"భవాని సాగర్, డా"తరుణ్ లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ జ్వరాల పట్ల అప్రమతంగా ఉండాలని వైద్య కేంద్ర సిబ్బందికి సూచించారు. ఈ తనికి నిర్వహణలో డి ఎం హెచ్ ఓ తో పాటు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రవి, డాక్టర్ కృష్ణకుమారి, ఆసుపత్రి సూపెర్వైజర్స్, ఏం ఎల్ ఎచ్ పి లు, ఏ ఎన్ ఎం లు, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలి

## షీ టీం ఎఎస్ఐ తబితరాణి

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 31: విద్యార్థినిలు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎఎస్ఐ తబితరాణి సూచించారు. శుక్రవారం స్థానిక రియన్ బి.ఎడ్. కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా దుర్వినియోగం, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థినిలు స్వీయ రక్షణ పద్ధతులు అలవర్చుకోవడంతో పాటు, అవసరమైతే షీ టీం సహాయం తీసుకోవడంలో వెనుకాడవద్దు అని అన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారు, వేధించే వారిపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొని ప్రశంసనీయంగా స్పందించారు.



## నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం....

### నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు...



**చౌటుప్పల్.అక్టోబర్ 31. క్రైమ్ మిర్రర్:** అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండల కేంద్రంలోని లింగోజిగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. చౌటుప్పల్ సిఐ మన్మధకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివరాజ్ (47), దినేష్(42) అనే ఇద్దరు వ్యక్తులు చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గూడెం గ్రామ పరిధిలోని దివిస్ పరిశ్రమలో లేబర్స్ గా పనిచేస్తున్నారు. నిందితులిద్దరూ లింగోజిగూడెం గ్రామ పరిధిలోని ఒక రూమ్ లో అద్దెకు నివసిస్తు న్నారు. ప్రక్కనే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం జీవనోపాధి కోసం వలస వచ్చి నాలుగేళ్ల తమ కూతురుతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం బాలిక తల్లి ఇంటి ముందు బట్టలు ఉతుకుతుండగా, ఆమె కుమార్తె తోటి స్నేహితురాలతో ఆడుకుం టుండగా ఈ సమయంలో అక్కడే నివాసము ఉంటున్న నిందితులు ఇద్దరు బాలికకు చాక్లెట్ ఇస్తామని ఆశ చూపి ఆ బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు మూసి అఘాయత్నానికి పాల్పడగా బాలిక కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు అప్రమత్తమై బాలికను కాపాడారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడి చేరుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని, బాలికను వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం తెలియజేస్తామని సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ

**చౌటుప్పల్. అక్టోబర్ 31, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ సంఘం చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 38 మంది రైతులు తెచ్చిన ధాన్యం 3000 బస్తాల వరకు ధాన్యం తడిసిపోయిందని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, ఆర్డిఓ శేఖర్ రెడ్డి లకు తెలిపారు. వాతావరణం చల్లగా ఉంటున్నందున తేమశాతం 17 కాకుండా 20 వరకు ఉన్నదానిని కూడా కొనుగోలు చేయాలని వారికి తెలిపారు. జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడుతూ... తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టి తాము సూచించిన రైస్ మిల్లులకు పంపవలసిందిగా నిర్వాహకులకు తెలిపారు. అకాల వర్షాలు వస్తున్నందున రైతులు తమ దాన్య రాశులపై తర్పాలిక్ పట్టాలను కప్పుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సంఘ చైర్మన్ అధికారులను కోరాగా తడిసిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని అధికారులు తెలపగా ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఆర్ఐ సుధాకర్,ఏఈఓ ఉమామహేశ్వరి, రైతులు, కొనుగోలు సిబ్బంది, సంఘ కార్యదర్శి వై రమేష్ పాల్గొన్నారు.



## వివాహా వేడుకల్లో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా:** చౌడపూర్ మండలం మందిపాల్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మఠం రాజాశేఖర్ కోడలి వివాహం షాద్ నగర్ లోని కేకేఆర్ కన్వెన్షన్ హాల్ లో వివాహా వేడుకల్లో పరిగి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహా వేడుకలలో బిఆర్ఎస్ పార్టీ చౌడపూర్ మండల్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ, పంచాయతీ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి హైకోర్టు అడ్వకేట్ కోసిగి వెంకటేష్, దోమ వైస్ ఎంపీపీ మల్లేష్, మందిపాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోయడం మరియు కట్టిన ఇండ్లను పరిశీలించడం





క్రైమ్ మిర్రర్ (మొయినాబాద్) అక్టోబర్ 31, మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో శుక్రవారం రోజున ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోయటం మరియు కట్టిన ఇండ్లను పరిశీలించడం జరిగింది. ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ ఇండ్లను తప్పకుండా నిర్మించుకోవాలి. నిర్మాణానికి కావలసిన అమౌంటు దశలవారీగా విడుదల చేస్తుంది. ప్రజలు ఎవరు కూడా అపోహాలు నమ్మవద్దు. నిరుపేదల కోసం కూడా ప్రభుత్వం సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణ రెడ్డి, పి ఏ సి ఎస్ డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డ, మొయినాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మర్రి రవీందర్ లిరెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ కురువ రాములు, మర్రి వంశీదర్ రెడ్డి, గుర్రల భాస్కర్, గోటూరి వనజ, మాజీ వార్డు మెంబర్ హరిందర్, ఈరని రాజు, జంజూరు రాజయ్య, పోలీస్ శేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, పెట్లోల్ల రఘురామ్ రెడ్డి, జంజూరు శ్రీను, గుర్రల శ్రీను, మేకగూడెం నర్సింహా, గౌండ్ల యాదయ్య, ఆలూరు మహేందర్, వడ్ల విటలయ్య మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొర్రెను కాపాడబోయి వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దపల్లి జిల్లా లో చోటు చేసుకుంది....



**పెద్దపెల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ న్యూస్ అక్టోబర్ 31 :** పెద్దపల్లి జిల్లా శివారులోని గౌరెడ్డి పేట గ్రామానికి చెందిన మల్లేశం అనే గొర్రెల కాపరి తన గొర్రెలను మోపడం కోసం గ్రామ శివారులోని ఇటుక బట్టి ప్రాంతానికి వెళ్ళాడు...ఇటుక బట్టి నిర్వహుకులు అవసరం కోసం విద్యుత్ సరఫరా తీసుకోగా ఆ తీగలు వేలాడుతున్నాయి...గొర్రె మేస్తూ తీగలకు తగలడం తో గొర్రెను కాపాడే క్రమం లో తీగలకు తగిలి గొర్రె తో పాటు అక్కడిక్కడే మృతి చెందాడు.....సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు....మల్లేశం మృతి తో కుటుంబం లో విషాదఛాయలు అలుముకున్నాయి... రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.....

## నెంబర్ ప్లేట్లకు భారీగా ధరలు

### రంగారెడ్డి జిల్లా రవాణాశాఖకు సమకూరిన భారీ నగదు

**గండిపేట్, (క్రైంమిర్రర్) :** రంగారెడ్డి జిల్లా రవాణా కార్యాలయంలో ప్రత్యేక నెంబర్లను భారీగా డబ్బులు చెల్లించి వాహనదారులు పొందారు. ప్రధానంగా జిల్లా పరిధిలోని మై హెూం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు టీజీ07ఏహెచ్9999 నెంబర్ ను రూ.11.5 లక్షలకు, బాదం ఇన్‌ఫ్రా డెవలెపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.4,29,999 కు టీజీ07ఏకే0099 ను, మరో వాహనానికి రూ.4,19,999 కు టీజీ07ఏకే0009, స్టాట్9 సాఫ్ట్ వేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన వారు రూ.3.85 లక్షలకు టీజీ07ఏకే0001, అవిటా బిల్డ్ ప్రో ఎల్ఎల్పీ వారు రూ.3,07,777 లకు టీజీ07ఏకే0007 నెంబర్ ను పొందారు. మొత్తంగా రవాణా శాఖకు రూ.5,301,544 నగదు సమకూరినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో 55 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్



జోగులాంబ గద్వాల జిల్లా లో గురుకుల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్.. ధర్మవరం గురుకుల పాఠశాలలో 55 మంది విద్యార్థులకు అస్వస్థత. సాయంత్రం భోజనం చేసిన తర్వాత విద్యార్థులకు వాంతులు, విరోచనాలు. భోజనంలో రైస్, చారు క్యాలీఫ్లవర్ కూర, ఎగ్ తిన్న తరువాత విద్యార్థులకు అస్వస్థత. విద్యార్థులను 108 అంబులెన్స్ లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.6 గురు పరిస్థితి విషమం

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అజిత్ దోవల్ పరోక్ష విమర్శలు

జాతీయ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే దుష్ప్రచారంపై అజిత్ దోవల్ హెచ్చరిక

రక్షణ, న్యాయ, ఎన్నికల వ్యవస్థలే లక్ష్యంగా కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని వ్యాఖ్య

ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో దోవల్ పరోక్ష వ్యాఖ్యలకు ప్రాధాన్యత

ప్రభుత్వ ప్రతిష్టను కాపాడేందుకు 'పర్సెప్షన్ మేనేజ్‌మెంట్' ఎంతో ముఖ్యం

అవినీతిపై కఠినంగా వ్యవహరించాలని, జాలి చూపవద్దని సూచన

కింది అధికారి లంచం తీసుకుంటే పై అధికారిదే బాధ్యత కావాలన్న దోవల్




దేశంలోని కీలక వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు దుష్ప్రచారాలు తీచేస్తున్నారూటూ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగా రక్షణ, న్యాయ, ఎన్నికల వ్యవస్థల వంటి అత్యంత పవిత్రమైన సంస్థల ప్రతిష్ఠను కించపరిచే ప్రయత్నం చేస్తున్నాయని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో పక్షపాతం జరుగుతోందంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వంటి వారు ఎన్నికల సంఘంపై విమర్శలు చేస్తున్న తరుణంలో, దోవల్ పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం 'రాష్ట్రీయ ఏక్తా దివస్' సందర్భంగా 'పరిపాలన' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. "రక్షణ దళాలు, భద్రతా బలగాలు, న్యాయవ్యవస్థ, కాగ్, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థలే లక్ష్యంగా కొన్ని శక్తులు దుష్ప్రచారం చేస్తున్నాయి. ఈ సంస్థల విశ్వసనీయతను దుష్ప్రచారం, విద్వేషపూరిత ప్రచారాలు లేదా సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీయడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. ఈ వ్యవస్థలు అత్యంత పవిత్రమైనవి" అని దోవల్ స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు దేశానికి అత్యంత వినాశకరమైనవి అవుతాయని హెచ్చరించారు.దేశ ప్రతిష్ఠకు భంగం కలిగితే, అది జాతీయ సంకల్పాన్ని దెబ్బతీస్తుందని, ప్రజలు దేశ ఆర్థిక, ఎన్నికల వ్యవస్థలపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దీనిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం 'పర్సెప్షన్ మేనేజ్‌మెంట్' (ప్రజాభిప్రాయ నిర్వహణ)పై మరింత దృష్టి పెట్టాలని, ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పరిపాలనలో జవాబుదారీతనం పెరగాలని, తప్పు చేసిన వారిపై ఏమాత్రం సహనం చూపకూడదని దోవల్ అభిప్రాయపడ్డారు. "తప్పుడు స్థానంలో చూపించే జాలి అత్యంత చెత్త నాణ్యతకు నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారిని రక్షించే వారికి కూడా కఠిన శిక్షలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పోలీసు శాఖలో అవినీతిని తగ్గించేందుకు తాను గతంలో చేసిన ఓ సూచనను ఈ సందర్భంగా గుర్తుచేశారు. "ఒక పోలీసు అధికారి అవినీతికి పాల్పడితే, అతని పై అధికారికి చెందిన సర్వీస్ రికార్డులో రిమార్కు నమోదు చేయాలి. తన కింద పనిచేసే వారి అవినీతిని నియంత్రించలేకపోయారని పేర్కొనాలి. అప్పుడు పై అధికారి తన ప్రయోజనాల కోసమైనా కింది స్థాయి సిబ్బంది అవినీతిని కనీసం 50 శాతం తగ్గిస్తారు," అని దోవల్ వివరించారు.

## రాయలసీమ వర్సిటీలో కత్తి పట్టి హల్ చల్ చేసిన విద్యార్థి

రాయలసీమ యూనివర్సిటీలో కత్తితో బీటెక్ విద్యార్థి హల్‌చల్

ఇద్దరు విద్యార్థుల మధ్య స్వల్ప ఘర్షణతో మొదలైన వివాదం

తోటి విద్యార్థిని కత్తితో బెదిరించిన అజయ్ నాయక్

రంగంలోకి దిగిన వర్సిటీ అధికారులు, పోలీసులు

విద్యార్థి అజయ్ నాయక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం

కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో తీవ్ర కలకలం రేగింది. ఓ బీటెక్ విద్యార్థి, తోటి విద్యార్థిపై కత్తితో దాడికి యత్నించి హల్‌చల్ సృష్టించాడు. వర్సిటీ అధికారులు సకాలంలో స్పందించి గొడవను నివారించగా, సమాచారం అందుకున్న పోలీసులు సదరు విద్యార్థిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న అజయ్ నాయక్, బాలాజీ నాయక్ అనే ఇద్దరు విద్యార్థుల మధ్య గురువారం రాత్రి ఓ చిన్న విషయంలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన అజయ్ నాయక్, తన గది నుంచి కత్తి తీసుకువచ్చి బాలాజీ నాయక్ గది వద్దకు వెళ్లి అతడిని బెదిరించాడు. ఈ ఘటనతో అక్కడున్న తోటి విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.విషయం తెలుసుకున్న విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని అజయ్‌ను నిలువరించి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం, ఈ ఘటనపై శుక్రవారం ఉదయం కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





## సాక్షి రిపోర్టర్ శేఖర్ కుమార్తె వివాహంలో పాల్గొన్న కుల్కచర్ల మండలం నాయకులు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా:** కుల్కచర్ల మండల పుట్టపాడు వాస్తవ్యులు సీనియర్ సాక్షి రిపోర్టర్ శేఖర్ కుమార్తె వివాహ వేడుకలు హిమాహిత్ నగర్ లోని శ్రీ విజయ ఠాగూర్ గార్డెన్ లో ఘనంగా జరిగాయి.ఈ వివాహ కార్యక్రమంలో కుల్కచర్ల మండల నాయకులు పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించారు. ఈ వివాహ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బోలుసని భీమ్ రెడ్డి, సీటీవో రాంచేందర్, పరిగి బ్లాక్ బి అధ్యక్షులు కర్రే భరత్ కుమార్,మాజీ ఎంపీపీ సత్య హరిచేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుప్పలి వెంకటేశం,మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పెంటమీది వెంకటయ్య, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య,మాజీ ఎంపీటీసీ చెలిమిళ్ల ఆనంద్, ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్,గోపాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సాలెటి రవి కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, సీనియర్ నాయకులు నాగని బిచ్చయ్య,పోతగాళ్ల గోపాల్,మేకుల భీమ్ సెన్,దొమ్మ వెంకట్, కోడుదూటీ బాను,బొవని రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కార్మిక శాఖ మంత్రితో కలిసి ప్రచారం చేసిన పరిగి ఎమ్మెల్యే టిఆర్ఆర్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా షేక్‌పేట్ డివిజన్ లోని బూత్ నంబర్ 41,42 లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రాంమ్మోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రజలతో ముఖాముఖీగా మాట్లాడి,ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి,హైదరాబాద్ అభివృద్ధికి బలం చేకూర్చాలని ప్రజలను కోరారు.

## ముజాహిద్పూర్ గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటుకు సహకరిస్తాం

### కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్

### సీసీ కెమెరాల కోసం 11 వేల రూపాయల చెక్కు అందజేత

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ముజాహిద్పూర్ గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించి ముందుకు రావాలని సిసి కెమెరాలు కొరకు ఆర్థిక సహాయాన్ని అందించాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులకు శుక్రవారం సీసీ కెమెరాలు గురించి 11 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ప్రతి మంగళవారం సంతా జరిగే ప్రదేశంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉంటాయని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, గ్రామపంచాయతీ కారోబార్ పడెగళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
సినిమా
10
శనివారం
1-11-2025

# ఎంగేజ్‌మెంట్‌పై రష్మిక ఆసక్తికర సమాధానం

విజయ్ దేవరకొండతో తన ఎంగేజ్‌మెంట్‌పై నటి రష్మిక ఆసక్తికర సమాధానం చెప్పి తప్పించుకున్నారు. రష్మిక తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో రష్మికను ఓ అభిమాని విజయ్‌తో నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం' అని అన్నారు. ప్రస్తుతం రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశాల్లో పాల్గొంటూ జోష్ పెంచుతున్నారు. తనకెంతో ఇష్టమైన 'డియర్ కామ్రేడ్' గురించి మాట్లాడారు. అలాగే విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ పైనా స్పందించారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కాకుండా కొన్నేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే ఉపయోగం లేదని ఆమె అన్నారు. విజయ్ దేవరకొండ, ఆమె జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. 2019లో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఈ సినిమా తమకెంతో ప్రత్యేకమని విజయ్, రష్మిక ఎన్నో సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా రష్మిక దీనిపై స్పందిస్తూ.. అప్పుడు ఆదరణ దక్కలేదని.. కానీ, ఇప్పుడు యూట్యూబ్‌లో అందరూ దీని గురించే మాట్లాడుకుంటున్నారని అన్నారు. డియర్ కామ్రేడ్'ను థియేటర్‌లో ఆడియన్స్‌తో పాటు చూశాను. కానీ, మేం ఆశించిన ఫలితం రాలేదు. నా దృష్టిలో ఇప్పటికీ అది ఒక గొప్ప చిత్రమే. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా 'దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్ల డానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం' అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో 'డియర్ కామ్రేడ్' గురించి పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు.






# అడవిశేష్ డెకాయిట్ ఉగాదికి రిలీజ్

అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' . తాజాగా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 2026 ఉగాదిని పురస్కరించుకుని మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయనున్నారు. సంబంధిత పోస్టర్‌ను అడివి శేష్ సోషల్ మీడియాలో పంచుకుంటూ.. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకు వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరం లేదు' అని క్యాప్షన్ పెట్టారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే. విభిన్న ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ, ఆమె స్థానంలో ఇప్పుడు మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. డిసెంబరు 25న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం గతంలో వెల్లడించగా.. ఇప్పుడు వాయిదా వేసింది. అడివిశేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం డెకాయిట్ ముందుగా వచ్చిన వార్తల ప్రకారం క్రిస్మస్‌కు ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. అయితే ఎవరూ ఊహించని విధంగా కొత్త తేదీ ప్రకటిస్తామంటూ తెలిపారు మేకర్స్. ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ జీప్‌లో ఉండగా.. ఈ ఇద్దరూ గన్‌తో శత్రువులను ఎదుర్కొంటూ తమను తాము రక్షించుకుంటున్న కొత్త పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ మూవీని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.




# ఫౌజీ మూవీలో యంగ్ ప్రభాస్‌గా దర్శన్

సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు, మహేశ్ బాబు బావ సుధీర్ బాబు ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో హీరోగా తనకంటూ ఓ గుర్తింపును సంపాదించుకున్నాడు. కృష్ణ చిన్నకూతురు ప్రియదర్శిని భర్త అయిన సుధీర్ బాబు తన కొడుకులనూ సినిమా రంగంలోకే తీసుకొస్తుండటం విశేషం. ప్రియదర్శిని, సుధీర్ బాబు జంటకు ఇద్దరు కొడుకులు. పెద్దబ్బాయి చరిత మానస్. ఇతను గతంలో 'భలే భలే మొగాడివోయ్' చిత్రంలో చిన్నప్పటి నాని (ఔజీనితి) గా నటించాడు. అలానే చిన్న కొడుకు దర్శన్ కూడా కొన్ని సినిమాల్లో నటించాడు. 2018లో వచ్చిన 'గూఢచారి'లో చిన్నప్పటి అడివి శేష్ గానూ, 2022లో వచ్చిన 'సర్కారు వారి పాట'లో చిన్నప్పటి మహేశ్ బాబు గానూ దర్శన్ నటించాడు. తాజాగా సుధీర్ బాబు తనయుడు దర్శన్ 'ఫౌజీ' మూవీలో యంగ్ ప్రభాస్ గా నటిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా అతని తండ్రి సుధీర్ బాబు తెలిపాడు. సుధీర్ బాబు నవంబర్ 7న విడుదల కాబోతున్న తన తాజా చిత్రం 'జటాధర' ప్రమోషన్స్ సమయంలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ సినిమాలో భారీ సంస్కృత సంభాషణలు ఉన్నాయని, వాటిని చాలా సులువుగా, సునాయాసంగా దర్శన్ చెప్పేశాడని యూనిట్ సభ్యులు అంటున్నారు. 'ఫౌజీ' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న 'ఫౌజీ'తో ప్రభాస్ సరసన ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోంది.




# రామాయణ పారితోషికం క్యాన్సర్ బాలలకు విరాళం

### పెద్ద మనసు చాటుకున్న వివేక్ ఒబెరాయ్

బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ తన గొప్పమనసుతో మరోసారి వార్తల్లో నిలిచారు. అగ్ర దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం సినిమాలో రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో కథానాయకుడిగా నటిస్తుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటించబోతుంది. రావణుడిగా యష్ నటిస్తున్నాడు. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ విభీషణుడి పాత్రలో నటించబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ పాత్రకు సంబంధించిన పారితోషికంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు వివేక్. 'రామాయణం' సినిమాకు తాను అందుకునే పూర్తి పారితోషికాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వివేక్ ప్రకటించారు. తన జీవితంలో ఏది చేసినా పూర్తి ప్రేమతోనే చేస్తానని చెప్పిన వివేక్ తన పారితోషికాన్ని క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లల సహాయార్థం విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రాకు నేను స్పష్టంగా చెప్పాను ఈ సినిమాకు 'నాకు ఒక పైసా కూడా వద్దు'.

# ఉప్పెన లెవల్లో డ్యూడ్ విజయం



మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ కొత్త దర్శకులకు దన్నుగా నిలుస్తారనే విషయం మరోసారి రుజువైంది. అప్పట్లో వైష్ణవ్ తేజ్ , కృతిశెట్టిని హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'ఉప్పెన' సినిమాను నిర్మించింది. ఆ మూవీతో బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కొత్త వాళ్ళతో తీసిన 'ఉప్పెన' సినిమా ఘన విజయాన్ని సాధించింది. ఏకంగా వంద కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. సింగిల్ లాంగ్వేజ్ లోనే ఆ సినిమా ఆ రికార్డ్ ను సాధించడం విశేషం. ఓ కొత్త హీరో, హీరోయిన్ల సినిమా ఆ స్థాయి వసూళ్ళను గతంలో ఎప్పుడూ చేయలేదు. అయితే దానిని నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థే ఇప్పుడు అదే రికార్డ్ ను రిపీట్ చేసింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'డ్యూడ్' మూవీని నిర్మించింది. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమాతో కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయం అయ్యాడు. గతంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించి 'లవ్ టుడే', 'డ్రాగన్' చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఇప్పుడు 'డ్యూడ్' సైతం చక్కని విజయాన్ని అందుకుని అతనికి హ్యాట్రిక్ ను అందించింది. ఈ సినిమా ఇంతవరకూ వంద కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సైతం హర్షం వ్యక్తం చేసింది. 'ఉప్పెన' తర్వాత నూతన దర్శకుడితో తాము తీసిన 'డ్యూడ్' సైతం వందకోట్ల గ్రాస్ వసూలు చేయడం ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లోనూ కొత్త దర్శకులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తామని తెలిపింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.